క్లుప్తంగా

కార్పొరేటర్ చొరవతో కాలువపై పలకలు


కల్లపాకల వద్ద గల కాలువపై పలకలు వేయిస్తున్న విల్లూరి భాస్కరరావు

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో కార్పొరేటర్ చొరవతో కాలువపై సిమెంట్ పలకలు వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వార్డులో కల్లుపాకల వద్ద గల మురుగు కాలువపై పలకలు లేక స్థానికులు ఇబ్బందులకు గురయ్యేవారు. దీనిపై స్థానికులు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుకు ఫిర్యాదు చేయగా ఆయన వెంటనే జీవీఎంసీ అధికారులతో మాట్లాడి కాలువపై సిమెంట్ పలకలు వేయించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు ప్రశంసనీయం


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ వెంకటరమణమూర్తి


సీతమ్మధార : సీతమ్మధార వాసవీ క్లబ్ సేవలు ప్రశంసనీయమని కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి అన్నారు. మంగళవారం ద్వారకానగర్‌లోని ఆస్పత్రి ప్రాంగణంలో వాసవీ క్లబ్ సీతమ్మధార ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. సామాజిక సేవలో భాగంగా వాసవీ క్లబ్ నిర్విరామంగా అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం డాక్టర్ యశస్వి, క్లబ్ ప్రతినిధి సుగుణకుమార్, కళా గ్రూప్స్ హెచ్‌ఆర్ పంచాది వెంకటకృష్ణ (నాని), రేణుక ఎల్లమ్మ ఆలయ సెక్రటరీ పోలారావు, ప్రధాన అర్చకులు కె.కామేశ్వరశర్మ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న జానకీరామ్

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 37వ వార్డు రెల్లివీధిలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రావులపూడి ప్రసాద్ కుటుంబం గురించి 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ ద్వారా తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఆకుల ఏసు, డేవిడ్‌రాజు, కాసారపు వాసు, వెంకటలక్ష్మి, దైవకుమార్, ఆనంద్, శేఖర్, రమణ, ఆర్పీలు లక్ష్మి, వసుంధర, పార్వతి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు దుప్పట్ల అందజేత


వేంకటేశ్వరకాలనీలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ జన్మదిన వేడుకలు మంగళవారం నందగిరినగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం ఉషశ్రీ యూత్ ఫోర్స్ నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు. వేంకటేశ్వరకాలనీలో మహిళలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. జగన్నాథపురంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. అలాగే పుట్ట బంగారమ్మ గుడి వద్ద భక్తులకు, శంకరమఠంలో అయ్యప్ప దీక్షా స్వాములకు అన్నప్రసాద వితరణలో పాల్గొని వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో భైర వెంకట్, వల్లి, శ్యాం, పవన్, ప్రశాంత్, హరీష్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర యువతను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' క్రికెట్ పోటీలకు యువత నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఇప్పటికే భారీ సంఖ్యలో యువత ఈ పోటీల్లో పాల్గొనేందుకు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. నియోజకవర్గంలో ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో మంగళవారం ఈ పోటీలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి.

మట్టిలో మాణిక్యాలను వెలికి తీద్దాం


క్రికెట్ ఆడి పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

- 'ఆడుదాం ఆంధ్ర' టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వాసుపల్లి
- క్రీడాకారులకు క్రికెట్ కిట్ల పంపిణీ
- 47 రోజులు 5 దశల్లో సాగనున్న ఈవెంట్

జగదాంబ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర' టోర్నమెంట్ నిర్వహిస్తోందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 35వ వార్డులోని ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తర్వాత వారికి క్రికెట్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితాలను మార్చేది క్రీడలు మాత్రమే అన్నారు. చదువుతో పాటు ప్రత్యేక ఆసక్తితో నేర్చుకున్న బాక్సింగ్ వల్ల ఉద్యోగం సంపాదించుకున్నానని తెలిపారు. క్రీడలు ప్రతి ఒక్కరి జీవితాన్ని మార్చగలవని స్పష్టం చేశారు. యువతలో క్రీడా స్ఫూర్తి నింపేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే అతి పెద్ద టోర్నీ నిర్వహించాలన్న నిర్ణయం మేరకు నేడు ఈ కార్యక్రమం ప్రారంభించామన్నారు. 47 రోజుల పాటు అయిదు దశల్లో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్రం మొత్తం మీద 34 లక్షల మంది క్రీడాకారులు ఈ భారీ ఈవెంట్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని క్రీడాస్ఫూర్తి చాటాలని వాసుపల్లి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, కనకమహాలక్ష్మి ట్రస్ట్‌బోర్డ్ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, అశోక్, విష్ణు, బుజ్జి, దళమంతుల మాణిక్యాలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో కలిసి మైదానంలోకి ప్రవేశిస్తూ..


క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేస్తూ..

కనీవినీ ఎరుగని రీతిలో 'ఆడుదాం ఆంధ్రా'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : రాష్ట్ర ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిలో ఆడుదాం..ఆంధ్రా టోర్నమెంట్ నిర్వహిస్తోందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీతో కలిసి వాసుపల్లి మాట్లాడారు. ఇప్పటికే కోటీ 22 లక్షల మంది ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారని, దీనిలో 35 లక్షల మంది క్రీడాకారులు నమోదయ్యారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌కి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 15 వేల స్పోర్ట్స్ కిట్లు అందజేశారన్నారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ మాట్లాడుతూ ప్రపంచమే ఇప్పుడు ఆంధ్రరాష్ట్రం వైపు చూస్తోందని, గ్రామీణ ఆణిముత్యాలను ఈ క్రీడల ద్వారా వెలికి తీసి, దేశం గర్వించదగ్గ క్రీడాకారులను తీర్చిదిద్దడమే ముఖ్యోద్దేశమన్నారు. తాను కూడా క్రీడాకారుల కుటుంబం నుంచే వచ్చానని అన్నారు. మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అదిరిన ఆహ్వాన్ ఫెస్ట్

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్యం చేస్తున్న విద్యార్థులు


సందడి చేసిన సినీ నటి అవికాగోర్


హాజరైన విద్యార్థినులు

డాబాగార్డెన్స్: విద్యార్థుల కేరింతలతో ఏవీఎన్ కళాశాల ప్రాంగణం దద్దరిల్లింది. కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 'ఆహ్వాన్ ఫెస్ట్' మంగళవారం ప్రారంభమైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించగా.. మధ్యాహ్నం నుంచి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సినీతార అవికాగోర్, నటులు బుల్లెట్ భాస్కర్, ఐనవోలు ప్రసన్నకుమార్ పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. చదువుకుంటేనే భవిష్యత్ అంటూ హితవు పలికారు. ఫెస్ట్‌లో భాగంగా డ్యాన్స్, మ్యాజిక్, సింగింగ్, స్కిట్, స్టాండప్ కామెడీ, డైలాగ్ వార్స్, ర్యాంప్ వాక్‌తో విద్యార్థులు అదరగొట్టారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కళాశాలలో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు అందుకున్నారని.. అందుకు ఎంతో గర్విస్తున్నానన్నారు. వారందరి స్ఫూర్తితో విద్యార్థులు మరింతగా చదివి ఇటు కళాశాలకు..అటు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు ఫెస్ట్‌లో పాల్గొన్నారని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డీన్ డాక్టర్ జి శంకరనారాయణ, మీడియా కో ఆర్డినేటర్ పైడి రజని తదితరులు పాల్గొన్నారు.

గెలుపు గుర్రానికే సీటు

విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : నియోజకవర్గంలో గెలుపు గుర్రానికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సీటు ఇస్తారని, తప్పుడు నిర్ణయాలు ఏమాత్రం తీసుకోరని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబుకి, జగనన్నకు మధ్య పోలిక చూస్తే సముద్రమంతా తేడా ఉందన్నారు. జగనన్నకు మంచి నాయకత్వ లక్షణాలున్నాయన్నారు. నియోజకవర్గంలో పెయిడ్ ఆర్టిస్టులు ఎన్ని పన్నాగాలు పన్నినా జగనన్న నిర్ణయం మేరకే పని చేస్తానని తెలిపారు. జనసేన పార్టీకి గుర్తింపే లేదన్నారు. స్నేహితుల కోసం సలార్ సినిమా ఉంటే.. పార్టీ స్నేహం కోసం జనసేన.. టీడీపీలున్నాయన్న ట్రోలింగ్ నడుస్తోందన్నారు. పవన్ కల్యాణ్‌కు సిగ్గుంటే పార్టీని మూసేయాలన్నారు. తాను కింది స్థాయి నుంచి వచ్చిన సైనికుడినని గుర్తు చేశారు. మత్స్యకారులను కించపరిచిన చంద్రబాబును తరిమిన డైనమిక్ లీడర్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సంచలనమైన మార్పులతో ఏపీలో సంక్షేమం, అభివృద్ధి పరుగులెడుతున్నాయని, అంత బలమైన వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తే లేదని పలువురు విలేకరుల అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే వాసుపల్లి బదులిచ్చారు.

'అనుబంధ సంఘం ఏదో తెలపాలి'


సమావేశంలో మాట్లాడుతున్న వామనరావు

డాబాగార్డెన్స్ : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌కు అనుబంధ సంఘం ఏదో తెలపాలని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు ప్రశ్నించారు. నగరంలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. గౌతమ్‌రెడ్డి 2018 నవంబర్ 28న జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అనుబంధ సంఘంగా లేఖ ఇచ్చారని చెప్పారు. కానీ గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ మాత్రం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అనుబంధంగా చెప్పుకుంటూ ఇటీవల ఓ ప్రెస్‌మీట్ నిర్వహించడమే కాక అదే అనుబంధ సంఘంగా పలు కార్యక్రమాలు నిర్వహించడంలో ఆంతర్యమేంటో తెలపాలన్నారు. గుమ్మడి నరసింగరావు, కారె ఎల్లయ్య, డొక్కల పోలారావు, వెంకునాయుడు, తాతారావు, వెంకట్రావు, ఎల్లారావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ విశాఖ వ్యాలీ సభ్యురాలిగా ఇంద్రజ

డాబాగార్డెన్స్ : జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) విశాఖ వేలీ 2024 ఏడాదికి నూతన అధ్యక్షురాలిగా శంకు ఇంద్రజ నియమితులయ్యారు. నగరంలోని లయన్స్‌క్లబ్‌లో మంగళవారం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. జేసీఐ జోన్-4 జోనల్ ప్రెసిడెంట్ గొంప సురేష్, కేవీ రావు, శ్రీధర్, జోనల్ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్ తమ్ములూరి పాల్గొని ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన అధ్యక్షురాలు మాట్లాడుతూ 2024లో జేసీఐ చేపట్టే పలు విషయాలపై మాట్లాడారు. జేసీఐ సభ్యుల ద్వారా సేకరించిన వస్త్రాలు పేద వారికి పంపిణీ చేయడం, కళాశాల విద్యార్థులకు ఆత్మరక్షణ కార్యక్రమం పేరిట ప్రతి కళాశాలలో 15 రోజుల పాటు శిక్షణ అందించి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు చెప్పారు. క్లాసికల్ డ్యాన్స్ విద్యార్థులకు అవగాహన కల్పించేలా నాట్యమయూరి పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఫర్ యూత్ పేరిట కార్యక్రమాలతో పాటు స్పర్శ పేరిట గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో అమిరేష్, సిమాన్, హరీష్, జయరామ్ పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఇంద్రజ

రుణమాఫీకి బయో మెట్రిక్


గాజులవీధిలో మహిళలతో బయోమెట్రిక్ వేయిస్తున్న కార్పొరేటర్ విల్లూరి

జగదాంబ : నాల్గో విడత రుణమాఫీ కోసం జీవీఎంసీ 35వ వార్డులో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మహిళలతో బయోమెట్రిక్ వేయించారు. మంగళవారం వార్డులో గాజులవీధి, కల్లుపాకలు, పండావీధి ప్రాంతాల్లో మహిళలతో బయోమెట్రిక్ వేయించి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు రుణమాఫీ చేశారన్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు మూడు విడతలుగా జగనన్న రుణ మాఫీ చేసిన సంగతి తెలిసిందే అన్నారు. నాల్గవ విడత కూడా వార్డులో సుమారు రూ. 3 కోట్ల పైన గల రుణాల మాఫీ నిమిత్తం బయోమెట్రిక్ చేస్తున్నామన్నారు. గ్రూప్‌లో మహిళలందరి బయోమెట్రిక్ పూర్తి అయిన వెంటనే రుణాలు మాఫీ అవుతాయని భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార : జీవీఎంసీ 27వవార్డు దొండపర్తి పరదేశమ్మ గుడి వద్ద మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష ఆదరణ లభించింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతులను నూటికి నూరు శాతం పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. 2024లో అత్యధిక మెజార్టీతో ముఖ్యమంత్రిగా మరల జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు అధ్యక్షుడు, ఎరుకుమాంబ ఆలయం ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, అధికారులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సుందరంగా థీమ్ పార్కుల అభివృద్ధి


యోగా థీమ్ పార్కును పరిశీలిస్తున్న నగర కమిషనర్ సాయికాంత్ వర్మ

పీఎం పాలెం : ఆధునిక సమాజానికి అనుగుణంగా ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా థీమ్ పార్కులు తీర్చిదిద్దుతున్నామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. జీవీఎంసీ 6, 8 వార్డుల పరిధిలో నిర్మాణంలో ఉన్న థీమ్ పార్కులను మంగళవారం ఆయన పరిశీలించారు. పీఎం పాలెం షిప్‌యార్డు లే అవుట్‌లో నిర్మిస్తున్న యోగా థీమ్ పార్కును, బక్కన్నపాలెం బుచ్చిరాజు లే అవుట్‌లోని స్పోర్ట్స్ థీమ్ పార్కును, ఎమ్మెస్సార్ లే అవుట్‌లోని ల్యాండ్ స్కేప్ థీమ్ పార్కును, వైఎల్‌పీ లే అవుట్ ఫామ్ గార్డెన్ పార్కును పరిశీలించారు. యోగా థీమ్ పార్కును పచ్చని మొక్కలతో నింపాలని, స్పోర్ట్స్ థీమ్ పార్కులో వాలీబాల్, షటిల్, క్రికెట్ నెట్ ప్రాక్టీస్ ఏరియాలో గ్రీనరీ కోసం ఆకర్షణీయమైన మొక్కలు 15 రోజుల్లో నాటాలని ఆదేశించారు. అనంతరం కొమ్మాది జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. లా కాలేజీ జంక్షన్ ప్రమాదకరంగా ఉన్నందున వీ కన్వెన్షన్ ఎదురుగా స్థలం సూచిస్తూ జంక్షన్ తరలించడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జెడ్సీ కనక మహాలక్ష్మిని ఆదేశించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టీకల్చర్ ఎం.దామోదరరావు, పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్ రాజు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి భక్తుల పూజలు


కనకమహాలక్ష్మి దేవస్థానం ఆధ్వర్యంలో పిలకవానిపాలెంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 13వ రోజు మంగళవారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి సహస్రనామార్చన, సర్వదర్శనం, పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. 108 స్వర్ణపుష్పాలతో కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన జరిపారు. ప్రత్యేక పూజలు, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నగరానికి చెందిన చెల్లపిల్ల మహర్షి, పాతనగరం రాజప్పనాయుడు వీధికి చెందిన ఆనందకుమార్‌చే నిర్వహించిన బుర్రకథ భక్తులను అలరించింది. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


నగరం నలుమూలల తిరుగుతున్న అమ్మవారి ప్రచార రథం

సమాన పనికి సమాన వేతనమివ్వాలి


ర్యాలీగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్దకు వస్తున్న కార్మికులు, నాయకులు

సీతమ్మధార : మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని ఇచ్చిన వాగ్దానం అమలు చేయకపోతే సమ్మె ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ హెచ్చరించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం రైల్వేస్టేషన్ నుంచి డీఆర్‌ఎం కార్యాలయం, దొండపర్తి, ఎల్‌ఐసీ బిల్డింగ్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు టి.నూకరాజు, గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, ఎం.వి.ప్రసాదరావు, వి.కృష్ణారావు, జి.అప్పారావు, డి.ఆదినారాయణ, జెఆర్‌నాయుడు, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ వ్యవస్థాపక దినోత్సవం


జెండా ఆవిష్కరిస్తున్న బీజీహెచ్ మసేను తదితరులు

అల్లిపురం : సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు మంగళవారం అల్లిపురం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బీజీహెచ్ మసేను పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాల కోసం పోరాటం చేసిన పార్టీ సీపీఐ అన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, ఏఐటీయూసీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె. సత్యాంజనేయ, కె. సత్యనారాయణ, ఆర్. శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్, జి.రాంబాబు, ఎం.మన్మథరావు, సీఎస్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

బలరాముని అలంకరణలో అప్పన్న

సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి బలరాముని అలంకరణలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బలరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టింపజేశారు.